క్లుప్తంగా

నేడు పెదబయలులో ఆసరా చెక్కుల పంపిణీ

పెదబయలు: స్థానిక మార్కెట్ యార్డ్‌లో బుధవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని స్థానిక వెలుగు ఏపీఎం వంతాల ఈశ్వరబాబు నాయుడు తెలిపారు. అరుకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి

- ఎంఈవో రామచంద్రరావు



విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న ఎంఈవో

డుంబ్రిగుడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో రామచంద్రరావు అన్నారు. కించుమండ పంచాయతీ కొసంగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విలీయం కేరి పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



స్రవంతికి బహుతి అందజేస్తున్న హెచ్ఎం జగదీష్

డుంబ్రిగుడ: పాడేరులో గతనెల 30న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో గేదలబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని కుంబిడి శెట్టి స్రవంతి ప్రతిభ చూపింది. మంగళవారం ఆమెను ఆ పాఠశాల హెచ్ఎం జగదీష్, ఉపాధ్యాయుడు అప్పలస్వామి అభినందించారు. సైకిల్‌తో పాటు సర్టిఫికెట్ బ్యాగ్, వాటర్ బాటిల్,నోట్ పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

812 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశు వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మి

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ, రంగిలిసింగి పంచాయతీల్లో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించి 812 పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. పశువుల వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది అనురాధ,దివ్య,త్రినాథ్‌రావు, సంజీవ్, అనంతరావు,అప్పారావు, రాజు, మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఇసుకమేటలు



తైడ సమీపంలోని ఇసుక మేటలు

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్ రోడ్డులోని గతవారం కురిసిన వర్షాలకు రహదారిపై నుంచి నీరుపారడవంతో ఇసుకమేటలు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెయిర్ పిన్‌బెండ్ 3 సమీపంలోని, డముకు సమీపంలోని రహదారిపై ఇసుకమేటలు ప్రమాదభరితంగా మారాయి. దీంతో వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై ఇసుకమేటలు తొలగించాలని కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మునగపాక: ఉమ్మలాడలోని శ్రీ దేవీతల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మజ్జి రామస్వామినాయుడు కుమారుడు ఉపేంద్ర మంగళవారం రూ.20వేల విరాళం అందజేశారు. ఆలయకమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు ఈ మొత్తం అందజేశారు. అప్పలనాయుడు మాట్లాడుతూ దేవీతల్లి అలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని, తెలిపారు

మహిళలకు అండగా సీఎం జగన్



చింతపల్లిలో జరిగిన ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కోతులగుట్టలో జరిగిన ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- చింతపల్లి, కోతులగుట్టల్లో సందడిగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- అధిక సంఖ్యలో హాజరైన మహిళలు

చింతపల్లి: రాష్ట్రంలో మహిళలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. చింతపల్లిలో మంగళవారం వైఎస్సార్ ఆసరా సంబరాలు సందడిగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని చింతపల్లి మండలంలో 268 మహిళా సంఘాలకు మూడో విడత ఆసరా కింద రూ.91.24లక్షల చెక్కు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కింద ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వెలుగు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీలనుంచి మహిళాసంఘాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తమ హర్షధ్వానాలతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీపీ అనూషాదేవి, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాజులమ్మ, ఎంపీడీవో సీతయ్య, వెలుగు ఏపీఎం నాయుడు, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

కూనవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని కోతులగుట్టలో మంగళవారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 2,456 మందికి డ్వాక్రా సభ్యులకు రూ.98,85,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఆమె మట్లాడుతూ సింహభాగం సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే అమలవుతున్నాయని చెప్పారు. ఇప్పటికి మూడు దఫాలు అక్కచెల్లెమ్మ ఖాతాల్లో ఆసరా నగదు జమ అయిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, డ్వాక్రా సభ్యులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, మేరుకుల, ఆరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్లు డి. గంగాధర్, ఎ.వెంకటరామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవుల మరియాదాస్, మహిళా నాయకురాలు కె.సునీత, ఏపీఎం భాస్కర్ తదతరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ



బీమా చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య

రంపచోడవరం: వైఎస్సార్ బీమా పథకం పేదల పాలిట వరమని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న వారికి తక్షణ సహాయం అందుతుందన్నారు. రంపచోడవరం పంచాయతీ పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబంలోని నామినీలైన మడకం అనిత, పల్లా రాణీలకు వైఎస్సార్ బీమా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, కార్యదర్శి, వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్ సీపీ నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ బోడుగుడ గ్రామంలో లక్ష్మీదేవి ఆలయ అర్చకురాలు కిల్లో స్వామి(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న తదితరులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘనాథ్,బాలరాజు, రంజపల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సేవలపై అవగాహన కల్పించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి : సచివాయాల్లో ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్న సేవలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మంగళవారం ఆయన డీఎల్‌పురం, బంగారయ్యపేట సచివాలయాలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను గురించి ఆరా తీశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఈకేవైసీ, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, స్కిల్ డెవలప్‌మెంట్ యాప్ డౌన్లోడ్, వంటి కార్యక్రమాలను గురించి తెలియజేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన నగదును వెంటనే ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయాలన్నారు. బంగారయ్యపేట సచివాలయాన్ని సందర్శించిన అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మి కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్‌లు కిల్లాడ రామకృష్ణ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వనభసింగిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ కేంద్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను మంగళవారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు.ఉపాధి కూలీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న పనులపై ఆరా తీశారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా కేటాయించిన సమయం ప్రకారం పనులు పూర్తి చేయించాలని ఉపాధి సిబ్బందికి ఎంపీడీవో సూచించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలి



తురంగలపాలెంలో పొలంబడిపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయధికారులు

యలమంచిలి : తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే పంటలను రైతులు నాటాలని యలమంచిలి ఏడీఏ రవిప్రకాష్ అన్నారు. యలమంచిలి మండలం తురంగలపాలెం గ్రామంలో మంగళవారం పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలపై ఆశించే పురుగులు, తెగుళ్ల గుర్తించి ఎప్పటికప్పుడు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు పంటలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి రైతులకు సూచనలందించి వారికి వివిధ చార్ట్‌ల రూపంలో పంటపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం రైతులు ఏయే మందులు వాడాలి అని వివరించారు. కార్యక్రమంలో ఏవో ఉమాదేవి, వ్యవసాయాధికారులు స్వాతి, దివ్య, రీనా, అనురాధ, లలిత, అరుణ, ఏఈవో దేవుడు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



అశోక్ కల్యాణకుమార్‌కు చెక్కు అందజేస్తున్న బ్రాంచి మేనేజరు నాగరాజు

వై.రామవరం: మండలంలోని అన్నంపాలెం గ్రామానికి చెందిన కురసం అశోక్ కల్యాణ కుమార్ అనే లబ్ధిదారునికి మంగళవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజరు యు.నాగరాజు రూ.2లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈసందర్భంగా మేనేజరు మాట్లాడుతూ లబ్ధిదారు తండ్రి కురసం చిన్నాలుదొరకు ఎస్‌బీఐ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో(పీఎంజేజేబీవై) బీమా చేయించామన్నారు. ఇటీవల చిన్నాలుదొర మృతి చెందగా నామినీ అయిన అతని కుమారుడికి రూ.2 లక్షలు బీమా చెక్కు అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో క్యాషియర్లు దీపక్, శ్రీనివాస్, వీరరాజులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి మహోత్సవాలు



చౌడువాడలో చిట్టి పైడిమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు



పందూరు ఇందేశమ్మ తల్లి ఆలయంలో భక్తుల పూజలు

కోటవురట్ల : చౌడువాడ గ్రామంలో చిట్టి పైడిమాంబ అమ్మవారి మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే పందూరులో ఇందేశమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరాహనది తీరాన ఘాట్‌రోడ్డులో వేంచేసి ఉన్న ఇందేశమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రెండు ఆలయాలను మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు దర్శించి పూజలు చేశారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి భజన పోటీలు



పోటీల్లో పాల్గొన్న భజన బృంద సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మంగళవారం బాలాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామివారిని సర్పంచ్ జామి రమణబాబు తదితరులు దర్శించుకున్నారు. ఇక్కడ తీర్థం సందర్భంగా ఆలయం వద్ద జిల్లా స్థాయి బైటో భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 20 భజన బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా విశాఖ స్టీల్‌ప్లాంటు విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.ఎల్.పి.రావు, గోవాడ సుగర్స్ పరిపాలనాధికారి పప్పల వెంకటరమణమూర్తి (దాసు) వ్యవహరించారు.

ఘనంగా మొదలైన చోడమాంబిక అమ్మవారి పండగ



ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



అమ్మవారి సన్నిధిలో భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి వెలసిన చోడమాంబిక అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యింది. తెల్లవారు జాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాల పరిసరాల్లో సందడి నెలకొంది. భక్తుల కోలాహలంతో పాటు, పలు విక్రయల స్టాల్స్ నడుమ చోడపల్లిలో ఉత్సాహ వాతావరణం నెలకొంది. పండగను పురస్కరించుకొని జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ గండిబోయిన వెంకట్ లాంఛనంగా ప్రారంభించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విష్ణు హాస్పటల్స్, సురక్షా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

గంగాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



జాతరకు సిద్ధమైన అమ్మవారు పుట్టింటి చీర, సారె ఇతర పూజా సామాగ్రి

అడ్డతీగల: పవనగిరి క్షేత్రం వేదికగా గురువారం గంగాలమ్మ జాతర నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పవనగిరి వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు.వంద గ్రామాలకు పవనగిరి నుంచి పుట్టింటి చీర,సారె,పూజా సామగ్రి,ఘటం వంటివి ఉచితంగా అందజేయడానికి తగిన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పవనగిరిపై గంగాలమ్మ తల్లి విగ్రహంతో పాటు ఆలయానికి రంగులు వేయిస్తున్నట్టు ఆయన చెప్పారు.ఆరోజు వేకువజామునే వంద గ్రామాల నుంచి వచ్చే గిరిజన అర్చకులు,ప్రజలతో కలిసి గంగాలమ్మ అమ్మవారికి పూజాధికాలు చేసి, ఊరేగింపుగా సోమాలమ్మను దర్శించుకుని అనంతరం పూజా సామగ్రి తీసుకుని గిరిజనులు వారి వారి స్వస్థలాలకు వెళతారన్నారు. ఆయా గ్రామాల్లో నిర్ధేశించుకున్న సమయానికి గంగాలమ్మ జాతర్లు నిర్వహించుకుంటారన్నారు.

‘ఓపెన్’ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్ సీపీనాయకులు

అరకులోయరూరల్: ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కిల్లో రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం జరిగిన ఓపెన్ స్కూల్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. నిర్వాహకులు అందినకాడికి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల స్థానంలో వేరే వ్యక్తులతో పరీక్షలు రాయిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నట్టు చెప్పారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులను ఫిర్యాదు చేయనున్నట్ట ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జన్ని అర్జున్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



విద్యార్థినుల మానవహారం

డుంబ్రిగుడ: మండలంలోని అరమ నందివలస గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలలో సీడీపీవో నీలమ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ చిరుధాన్యాలు ఉపయోగించి పోషణను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు తప్పకుండా రాగి జావ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తీరేదెన్నడు?



అప్పలరాజుపేట రోడ్డు మధ్యలో గోతులు

రాజవొమ్మంగి: మండలకేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో గల అప్పలరాజుపేట గ్రామానికి రహదారి కష్టాలు దశాబ్దాలుగా తీరడం లేదు. ఏ మాత్రం వర్షం వచ్చినా ఈ మట్టి రోడ్డుపై గల పెద్ద పెద్ద గోతుల్లోకి నీరు చేరి చెరువును తలపిస్తోంది. కనీసం కాలినడకన వెళ్లాలన్నా ఈ ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులకు గురతున్నారు. పండిన పంటను మండలకేంద్రానికి తరలించాలన్నా కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రానికి సుమారు 9 కిలోమీటర్ల దూరంలో గల కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల, కొత్త వీధి గ్రామాలకు వెళ్లాలంటే అప్పలరాజుపేట మీదుగానే ప్రయాణించాలి. ఆయా గ్రామాలకు అప్పలరాజుపేట నుంచి బీటీ రోడ్ ఉన్నప్పటికీ రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు రహదారి సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. అప్పలరాజుపేట వరకు రెండు కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధిచేస్తే ఐదు గ్రామాలకు రహదారి, రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. నాతవరం, కొయ్యూరు, నర్సీపట్నం మండలాలలోని పలు గ్రామాలకు కూడా ఇది దగ్గర దారి అవుతుందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా నరేష్



నరేష్‌యాదవ్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్

వీఆర్‌పురం: యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని రేఖపల్లి గొల్లగూడెంకు చెందిన మోడెం నరేష్ ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక గొల్లగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘ అభివృద్ధికి పాటు పడాలని నూతనంగా ఎన్నికైన వారికి సూచించారు.అనంతరం అధ్యక్షుడు మోడెం నరేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు మాడి ముత్యాలరావు యాదవ్‌లకు నియామక పత్రాలు అందించి వారితో ప్రమణస్వీకారం చేయించారు. మరో ఎనిమిమంది సంఘం సభ్యులుగా ఎన్నికై నట్టు ఆయన చెప్పారు. అనంతరం కుర్ర శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాడి బాబురావు,మాడి వీరన్న,మాడి సంజీవరావు,సోల ప్రసాద్,సోల పాపమ్మ,మోడెం పిచ్చయ్య,మోడెం వెంకటేష్,మోడెం మహేష్,కట్టిబోయిన సత్యానారాయణ, రేఖపల్లి, రామవరం గ్రామాలకు చెందిన యాదవులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాడుగుల రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు మెరుగుపడతున్నాయని వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వి.వి.అగ్రహారంలో లక్ష్మీపురం చెరువు పనులను మంగళవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ చెరువు పూడికతీతకు, చెరువుగట్లు పటిష్ఠతకు రూ.10 లక్షలు మంజూరయ్యా యి. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వర రావు, స్థానిక సచివాలయ కన్వీనర్ బోగాది జోగారావు, కోన శివ, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణ రావు, దాడి రాజేశ్వరావు, ఈసీ ఉమాశంకర్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: జాబ్ కార్డులున్న అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో అరుణశ్రీ ఉపాధి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులకు దినసరి వేతనంగా రూ.272 అందుతుందన్నారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు కూలీ అందేలా అవగాహన కల్పించాలన్నారు. నిత్యం ఉపాధి పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.